

# ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం...నిబంధనలు కఠినం

**మిర్యాలగూడ నవభూమి, జూలై 3:-** ఇల్లు ఉన్న వారు రాజకీయ పలుకుబడితో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పేరిట డబ్బులు పొంద వచ్చని ఇళ్ల లబ్ధిదారుల జాబితాలో చేరిన కొంతమంది నిబంధనలు కఠిన తరం కావడంతో ఒక్కొక్క లబ్ధిదారుడు జారుకుంటున్నారు. ముగ్గు వేసిన నాటి నుండి వివిధ దశల వారీగా నిర్మాణాల ఫోటోలు పెడితేనే దశలవారీగా మొత్తం రూ.5లక్షలు చెల్లింపులు చేయాలని ప్రభుత్వం ఆదేశించగా అధికారులు అమలు చేస్తుండటంతో లబ్ధిదారులు ఒక్కొక్కరు వచ్చిన ఇంటిని వదులుకుంటున్నారు. కొంతమంది ఇంటి నిర్మాణం పేరిట డబ్బులు తీసుకోవచ్చనే ఉద్దేశ్యంతో ఎంపిక చేయించుకున్నారు. ప్రస్తుతం ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనలతో నిర్మాణం జరుగుతుంటేనే డబ్బులు ఇవ్వడం జరుగుతుంది. ముగ్గు వేసి బేస్మేట్ వరకు నిర్మాణం జరిగితే పూర్తి స్థాయిలో ఫోటో దిగి గ్రామపంచాయతీ కార్యదర్శి యాప్ లో పంపితే లక్ష రూపాయలు లబ్ధిదారుడి బ్యాంకు ఖాతాలో పడతాయి. లెంటల్ లెవెల్ వరకు నిర్మాణం జరిగితే ఒక లక్ష, స్లాబ్ వరకు పూర్తయితే రూ.2లక్షలు, మొత్తం నిర్మాణం పూర్తి అయిన తరువాత లక్ష రూపాయల ఇచ్చే విధంగా నిబంధనలు ఉండటంతో ఇల్లున్న వారు, ఫేక్ లబ్ధిదారులు ఒకొక్కరుగా జారుకునే అవకాశం ఉంది. ఐదు దశలలో జరిగే నిర్మాణ ప్రగతి ప్రతి గ్రామపంచాయతీ కార్యదర్శి చూపాల్సిన నిబంధన, బాధ్యత ఉండటంతో ఫేక్ లబ్ధిదారులు తగ్గే అవకాశాలున్నాయి. ఇప్పటికే కొన్ని మండలాల్లో లబ్ధిదారులు జారుకుంటున్నారు. నిబంధన వల్ల అసలు అర్హులకు ఇల్లు లభించే అవకాశం కలిగింది. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పారదర్శకంగా ఉండాలనే ఉద్దేశ్యంతో పెట్టిన కఠిన నిబంధనలతో లబ్ధిదారులు తగ్గి అసలు అర్హులకు ఇల్లు లభించే అవకాశం కలుగుతుందని భావిస్తున్నారు.

## చిన్నారి జన్మదినం... మొక్కల పంపిణీ



**రామగిరి జూన్ 03 నవభూమి న్యూస్:** రామగిరి మండలం రత్నాపూర్ మాజీ సర్పంచ్ పల్లె ప్రతిమ పీవీరావు కుమారుడు పల్లె సాక్షిత్ రావు బుధవారం జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా చిన్నారి సాక్షి రావు తన తోటి మిత్రులకు 'మనీ ప్లాంట్' మొక్కలను అందించారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ఈ చిన్నారి ఈ మొక్కలను అందించారు.

## షెడ్యూల్ కులాల అభివృద్ధి కోసం కేటాయించిన భూమి కబ్జాపై ఎంపీడీవోకు ఫిర్యాదు

**ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు బెల్లంపల్లి సురేష్**



**మహదేవపూర్, జులై 03, నవభూమి** మహాదేవపూర్ మండల కేంద్రంలో అంబేద్కర్ మరియు షెడ్యూల్ కులాల నిర్మాణం కోసం కేటాయించిన భూమిని కబ్జా చేయడం సరికాదని బెల్లంపల్లి సురేష్ అన్నారు. ఈ విషయమై ఎంపిడిఓకు గురువారం పిర్యాదు అందించారు. మహనీయులు మనకు హక్కులు కల్పిస్తే వారి పేరున ప్రభుత్వాలు స్థలాలు ఇస్తే మహనీయుల స్థలాలను కబ్జా చేయడం సరికాదని అన్నారు. షెడ్యూల్ కులాల అభివృద్ధి కోసం కేటాయించిన భూమిని కబ్జా చేయడం చాలా దుర్మార్గమని గతంలో ఉన్నత అధికారుల దృష్టికి తీసుకు పోయిన ఇప్పటివరకు స్పందించకపోవడం అధికారుల యొక్క పనితీరు ఎలా ఉందో స్పష్టంగా తెలుస్తుంది అన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి షెడ్యూల్ కులాల అభివృద్ధి కోసం కేటాయించిన స్థలాలు కబ్జా చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు బెల్లంపల్లి సురేష్ మాదిగ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యువసేన మండల అధ్యక్షులు మంథని రవితేజ, ఎడపల్లి గ్రామ శాఖ అధ్యక్షులు చేకూర్తి శ్రీనివాస్, సీనియర్ నాయకులు నల్లబుగా ధర్మయ్య తదితరులు పాల్గొన్నారు

## పలు కుటుంబాలను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్





**మహదేవపూర్, జులై 03, నవభూమి** మండలంలోని పలు గ్రామాలలో పుట్టమధూకర్ పర్యటించి పలువురి కుటుంబాలను పరామర్శించారు. మహదేవపూర్ మండల కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షురాలు ఓడేటి స్వప్న కుమారున్ని పరామర్శించారు. అన్నారం గ్రామంలో నగునూరి రాజేందర్ కు ఇటీవల శస్త్ర చికిత్స జరుగగా వారిని, కిడ్నీ సమస్యతో బాధపడుతున్న కొండ పోచయ్యను, ములుకల పోసక్క ఇటీవల మరణించగ వారి కుటుంబాన్ని, తోడేటి మొండయ్య కు ఇటీవల శస్త్ర చికిత్స జరుగగా వారిని, అనారోగ్యంతో బాధపడుతున్న చంద్ పాషా ను పరామర్శించారు.అదేవిధంగా మద్దులపల్లి గ్రామంలో చకినాల మల్లేష్ ఇటీవల మరణించగ వారి కుటుంబాన్ని పరామర్శించారు. మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ వెంట బీఆరెస్ నాయకులు పాల్గొన్నారు.

## గాలివానకు విద్యుత్ తీగలపై తొలగించే పనులు చేయించిన కాంగ్రెస్ నేత సలీం



**మిర్యాలగూడ నవభూమి జూలై 3:-** మిర్యాలగూడ పట్టణంలోని 39 వ వార్డు అశోక్ నగర్ లో గాలి వానకి కరెంటు తీగలపైన చెట్టు కూలిపోయింది. దీంతో కాంగ్రెస్ వార్డు ఇంచార్జి, కాంగ్రెస్ మైనారిటీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఎం.ఎ.సలీం మున్సిపల్, విద్యుత్ శాఖ అధికారులకు విషయం తెలిపి చెట్టు కొమ్మలను తొలగించే పనులు చేయించారు. విద్యుత్ సరఫరా పునరుద్ధరింప చేశారు. సకాలంలో స్పందించిన సలీంను వార్డు ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

### మహిళలు,విద్యార్థినిలు ఎలాంటి సమస్య ఉన్న

# నిర్భయంగా సంప్రదించండి

- మహిళలు పని చేసే ప్రదేశాల వద్దకి వెళ్లి అవగాహన కల్పిస్తున్న జిల్లా షీ టీమ్ బృందం
- మహిళలను వేధిస్తున్న పోకిరీలపై గత నెలలో 02 కేసులు ,04 పెట్టి కేసులు నమోదు
- జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే ఐపిఎస్



**సిరిసిల్ల జులై 3 నవభూమి బ్యూరో** విద్యార్థినులు, మహిళలు వేధింపులకు గురైనప్పుడు భయపడొద్దని, ధైర్యంగా ముందుకు వచ్చి ఫిర్యాదు చేస్తే నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ భరోసా ఇచ్చారు.జిల్లాలో షీ టీమ్ బృందం కళాశాలలో, పాఠశాలల్లో, విద్యార్థినిలకు గ్రామాల్లో పని చేసే ప్రదేశాల్లో మహిళలకు ర్యాగింగ్/ ఇవిటీజింగ్/ పోక్సో/ షీ టీమ్స్/ మహిళ చట్టలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించి అవగాహన కల్పించడం జరుగుతుంది.జూన్ నెలలో షీ టీమ్ కు వచ్చిన ఫిర్యాదులలో 02 %ఖీ×=%లు,04 పెట్టి కేసులు నమోదు చేసి మహిళలను, విద్యార్థినులను వేధిస్తున్న వారిని గుర్తించి వారియెక్క తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సెలింగ్ నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.....విద్యార్థినులు,మహిళలు అభద్రత బావనికి గురైనప్పుడు భయపడొద్దని,ధైర్యంగా ముందుకు వచ్చి షీ టీం కి ఫిర్యాదు చేస్తే నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటామని, జిల్లాలో మహిళల, విద్యార్థినిల రక్షణకై ప్రత్యేక చర్యలు తీసుకోవడం జరుగుతోందని ప్రధానంగా మహిళలు, విద్యార్థినిలు అపరిచిత వ్యక్తులతో అప్రమత్తంగా ఉండాలని, మీ వ్యక్తిగత సమాచారాన్ని వారితో పంచుకోవద్దని,ముఖ్యంగా సామాజిక మాద్యమాల్లో పరిచమయమ్యే వ్యక్తులతో మరింత అప్రమత్తం వుండాలని సూచించారు.మహిళలు తాము పనిచేసే ప్రదేశాల్లోగాని,మరేక్కడ్కెన లైంగిక వేధింపులకు గురౌవుతున్న,ర్యాగింగ్ లాంటి వేధింపులకు గురౌవుతున్న మహిళలు,విద్యార్థునులు,బాలికలు మౌనంగా ఉండకుండా, ధైర్యంగా పిర్యాదు చేయాలని సూచించారు.ఎవరైనా ఆకతయులు మహిళలను,యువతులను వేధింపులకు గురిచేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.విద్యాసంస్థలల్లోఎవరైనా వేధించిన,రోడ్డుపై వెళ్లేటప్పుడు,పని చేసే ప్రదేశాల్లో అవహేలనగా మాట్లాడిన ఉద్దేశపూర్వకంగా వెంబడించిన వెంటనేజిల్లా షీ టీమ్ నెంబర్ 8712656425 పిర్యాదు చేసినచో వారి మీద చట్టపరమైన చర్యాలు తీసుకోవడం జరుగుతుంది అని ఎస్పీ తెలిపారు.

## ఐ స్కేటింగ్‌లో లోటస్ ల్యాప్ పబ్లిక్ స్కూల్ విద్యార్థినికి జాతీయ ఛాంపియన్షిప్ మూడవ స్థానంలో గెలుపు










డెహ్రాడూన్ మహారాణా ప్రతాప్ స్పోర్ట్స్ కాలేజ్ ఐస్కేటింగ్ 20వ జాతీయ ఛాంపియన్షిప్ పోటీలు నిర్వహించడం జరిగింది. వివిధ రాష్ట్రాలలోని ఐస్కేటింగ్ విద్యార్థులు పాల్గొనగా లోటస్ ల్యాప్ పబ్లిక్ స్కూల్ సరూర్ నగర్ లో 9వ తరగతి చదువుతున్న విద్యార్థిని మహన్యా రెడ్డి అండర్ 14 లో మూడో స్థానం గెలుచుకొని కాశ్యపతకాన్ని పొందడం జరిగింది. పాఠశాల స్థాయి నుంచి ఇక్కడ క్రీడారంగంలో ఆసక్తి ఉన్న మహాన్యా రెడ్డికి తల్లిదండ్రుల ప్రోత్సాహంతో పాఠశాల డైరెక్టర్ డాక్టర్ శ్రీ కడారి చంద్రశేఖర్ రెడ్డి ప్రోత్భలంతో ముందుకు సాగుతున్న చిన్నారి జాతీయ అంతర్జాతీయ పోటీల్లో పాల్గొనడం జరుగుతున్నది. వివిధ దేశాలలో అంతర్జాతీయ జరిగే పోటీలలో పాల్గొని ఎన్నో విజయాలు సాధిస్తూ ముందుకు సాగుతున్నారు చిన్నారి.

### కార్మిక వ్యతిరేక చట్టాలను

# రద్దు చేసే వరకు పోరాటం చేస్తాం

- రైతు సంఘం జిల్లా అధ్యక్షులు డి.బాల్ రెడ్డి



**వీపనగండ్ల జులై 3 నవభూమి** వీపనగండ్ల మండల కేంద్రంలో బస్టాండ్ దగ్గర జూలై 9 సార్వత్రిక సమ్మె కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా అధ్యక్షులు డి బాల్ రెడ్డి మాట్లాడుతూ,,, అఖిల భారత కార్మిక సంఘాల పిలుపు మేరకు దేశ వ్యాప్తంగా జూలై 9 న, కేంద్రం తెచ్చిన కార్మిక చట్టాల సవరణకు వ్యతిరేకంగా జరిపే ఈ సమ్మె లో మండలం లోని కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపు ఇచ్చారు. కార్మికులు సుదీర్ఘ పోరాటాల ద్వారా ప్రాణ త్యాగాలు చేసి సాధించుకున్న కార్మిక చట్టాలను రద్దుచేసి నాలుగు లేబర్ కోడ్ ల పేరుతో కార్మిక వర్గ హక్కులను రద్దు చేస్తామంటే కార్మిక వర్గం చూస్తూ ఊరుకోదని, కార్మిక వర్గ పోరాటాల ద్వారా బుద్ధి చెబుతామని అన్నారు. కార్మికులకు సంఘాలు ఏర్పాటు చేసుకునే హక్కు లేకుండా, కార్మిక సంఘాల రిజిస్ట్రేషన్ ను కఠినతరం చేసి, కార్మికులను సంఘాల నుండి దూరం చేసేందుకు దీని ద్వారా పెట్టుబడిదారుల దోపిడీని విస్తృత పరిచేందుకు కేంద్రం తీసుకొచ్చిన కార్మిక చట్టాలను కార్మిక వర్గం ఐక్యంగా ప్రతిఘటించాలని కోరారు.కార్మిక వర్గాన్ని ఐక్యం కానీయకుండా విభజన రాజకీయాలను పెంచేందుకు, కార్పొరేట్ శక్తులకు దేశ సంపదను అప్పగించేందుకు, కార్మిక వర్గాన్ని బానిసలుగా మార్చేందుకు కేంద్రం కార్మిక చట్టాలను సవరించిందని విమర్శించారు.ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ పేరుతో కార్మిక హక్కులను నిర్వీర్యం చేయడం కార్మిక చట్టాలకు సవరణ చేసి,కార్మిక సంఘాల నిర్వీర్యం చేసి కార్పొరేట్ శక్తులను దేశాన్ని అప్పగించాలన్న కేంద్ర ప్రభుత్వ వైఖరికి వ్యతిరేకంగానే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు పిలుపునిచ్చామని తెలిపారు.కార్మిక వర్గానికి శ్రమకు తగ్గ ఫలితం దక్కనీయకుండా కనీస వేతనాలు అందించకుండా,ఎటువంటి సామాజిక భద్రత పథకాలు అమలు చేయకుండా చేసేందుకు నాలుగు లేబర్ కోడ్ లను కేంద్రం తీసుకొచ్చిందని విమర్శించారు. రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించాలని, రైతులందరికీ రుణమాఫీ చేసే కొత్త రుణాలు ఇవ్వాలని, రైతు భరోసా ప్రతి రైతుకు అందజేయాలని వారు డిమాండ్ చేశారు. ఉపాధి కూలీల వేతనం పెంచాలని, జూలై 9న జరిగే దేశవ్యాప్త సమ్మెలో అన్ని రంగాల కార్మికులు రైతులు వ్యవసాయ కూలీలు అధిక సంఖ్యలో పాల్గొని సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కన్వీనర్ బాలగౌడ్, కో కన్వీనర్ ఆశన్న, రైతు సంఘం నాయకులు బాలస్వామి, ఈశ్వర్, వెంకటేశ్వర్ గౌడ్, ప్రజా సంఘాల నాయకులు రామన్ గౌడ్, నవీన్, రంగస్వామి గౌడ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

### ప్రభుత్వ రేషన్ బియ్యం ప్రజలకు అందకుండా

# పక్కా దారి పట్టిస్తే కఠిన చర్యలు తప్పవు

- అక్రమంగా నిల్వ ఉంచిన 60 క్వింటాళ్లు పిడిఎస్ రైస్ పట్టుకున్న టాస్క్ ఫోర్స్ పోలీసులు
- టాస్కోర్స్ ఇన్స్పెక్టర్ నటేష్



**సిరిసిల్ల జులై 3 నవభూమి బ్యూరో** జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే ఐపిఎస్ ఆదేశాల మేరకు ఈరోజు ఎల్లారెడ్డిపేట మండలం గొల్లపల్లి గ్రామంలో బినవేని దేవయ్య %ం/శీ% ఎల్లయ్య, %ఖుస్రవ% 70,అనే వ్యక్తి వివిధ ప్రాంతాల్లో తక్కువ ధరకు రేషన్ బియ్యం సేకరించి ఎక్కువ ధరకు అమ్మడానికి నిల్వ ఉంచడన్న సమాచారం మేరకు ఈరోజు జిల్లా టాస్కోర్స్ సిబ్బంది, ఎల్లారెడ్డిపేట పోలీసులు సంయుక్తంగా ఆకస్మిక దాడి చేసి 60 క్వింటాళ్లు స్వాధీనం చేసుకొని తదుపరి చర్యల నిమిత్తం దేవయ్య ను అక్రమంగా నిల్వ ఉంచిన 60 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని ఎల్లారెడ్డిపేట పోలీస్ స్టేషన్లో అప్పజెప్పడం జరిగిందన్నారు.ఈ సందర్భంగా టాస్కోర్స్ ఇన్స్పెక్టర్ మాట్లాడుతూ....రాష్ట్ర ప్రభుత్వం పేదలకు అందిస్తున్న రేషన్ బియ్యం అక్రమ రవాణా చేస్తూ పేద ప్రజలకు అందకుండా పక్కదారి పట్టిస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు నిరంతరం నిఘా పెడుతూ స్పెషల్ డ్రైవ్ లు చేస్తూ విస్తృత స్థాయిలో దాడులు నిర్వహిస్తున్నామని అన్నారు.ఈ దాడులలో టాస్కోర్స్ సిబ్బంది రాజేష్,తిరుపతి,శ్రీనివాస్ ,శివ పాల్గొన్నారు.

## కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టే పథకాలు పొందాలంటే ప్రతి రైతుకు ఆధార్ గుర్తింపు కార్డులు తప్పనిసరి

**ఏడీఏ పానగల్ డాకేశ్వర్ గౌడ్**




**వీపనగండ్ల జులై 4 నవభూమి** వీపనగండ్ల మండల కేంద్రంలో రైతు వేదికలో రైతులతో మాట్లాడుతున్న వ్యవసాయ అధికారి, ఈ సందర్భంగా వ్యవసాయ అధికారి డాకేశ్వర్ గౌడ్ మాట్లాడుతూ,,, కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టే పథకాలు పొందాలంటే రైతులకు ఇకనుంచి కచ్చితంగా విశిష్ట గుర్తింపు కార్డు ఉండాలి 11 నెంబర్లతో ఐడి కార్డ్ ఉన్న రైతులకు కేంద్ర పథకాలు సక్రమంగా అందుతాయి అకాల వర్షాలు ,పకృతి విపత్తులు సమయంలో నమోదు చేస్తే రైతు పంట సాగు చేసిన పూర్తి వివరాలు తెలుస్తాయి మరియు పీఎం కిసాన్, పంటల బీమా ఇతర కేంద్ర పథకాలు రైతులకు సకాలంలో అందుతాయి ప్రతి రైతు ఆధార్ మరియు ఆధార్ తో అనుసంధానమైన మొబైల్ నెంబరు సంబంధిత వ్యవసాయ అధికారి అందజేయగలరు. ఈ కార్యక్రమం వ్యవసాయ అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాల్లో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

**హాస్టళ్ల పరిసరాలు, వంటగదులు,**

**ఆహార పదార్థాల పరిశీలన**

**మెనూ పాటించడం, విద్యార్థుల సంఖ్యపై ఆరా**



**సిరిసిల్ల జులై 3 నవభూమి బ్యూరో** జిల్లాలోని పలు ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాల్లో జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా గురువారం సాయంత్రం ఆకస్మికంగా తనిఖీ చేశారు. సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని చిన్న బోనాల గురుకుల వసతి గృహం, పెద్దూర్ లోని మహాత్మా జ్యోతి భాపూలే వసతి గృహం, మండేపల్లిలోని బాలుర హాస్టల్, సిరిసిల్ల లోని మహాత్మా జ్యోతి భాపూలే బాలికల వసతి గృహం, తంగళ్ళపల్లి మండలంలోని మైనారిటీ సంక్షేమ శాఖ బాలికల వసతి, బద్దెనపల్లి లోని బాలికల ఎస్సీ వసతి గృహంలకు కలెక్టర్ చేరుకొని ముందుగా ఆయా హాస్టళ్ల పరిసరాలు, కిచెన్, నిలువ చేసిన ఆహార పదార్థాలు, పండ్లు, కూరగాయలు, బియ్యం, త్రాగు నీరు, తదితర అంశాలు తనిఖీ చేశారు.

## గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలకు మహిళా ప్రిన్సిపాల్‌ను నియమించాలి

**ఎస్ఎఫ్ఐ**




**మిర్యాలగూడ నవభూమి, జూలై 3:-** మిర్యాలగూడ మండలం అవంతిపురం గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలకు మహిళా ప్రిన్సిపాల్ ను నియమించాలని ఎస్ఎఫ్ఐ మిర్యాలగూడ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో గురువారం సబ్ కలెక్టరేట్ పరిపాలన అధికారి శ్రీనివాస్ శర్మకు వినతిపత్రం అందజేశారు.రాష్ట్ర కమిటీ సభ్యులు కుర్ర సైదా నాయక్ మాట్లాడుతూ మిర్యాలగూడ మండలం అవంతిపురం గ్రామంలో గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో మహిళ ప్రిన్సిపాల్ ని ఏర్పాటు చేయాలని కోరారు. మహిళా ప్రిన్సిపాల్ నియమించడం వల్ల విద్యార్థినిలకు ఎలాంటి ఇబ్బంది ఉండదన్నారు. బాలికల ఆశ్రమ పాఠశాలకు మహిళా ఉపాధ్యాయుల నియమించడమే ఉత్తమమన్నారు అదేవిధంగా ఆశ్రమ పాఠశాలలో ఉన్న గుట్టను తొలగించడం వల్ల విద్యార్థినులకు ఆడుకోవడానికి ప్లే గ్రౌండ్ ఏర్పాటు అయితదని తద్వారా విద్యార్థులు శారీరక దృఢత్వాన్ని పొందగలుగుతారన్నారు.కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు జగన్నాయక్ ఎస్ఎఫ్ఐ టౌన్ ఉపాధ్యక్షుడు అనిల్ నాయకులు అఖిల్ బన్నీ మణి తరుణ్ కల్యాణ్ పాల్గొన్నారు

## వ్యభిచారం చేస్తున్న ఇద్దరు పురుషులు, ఆరుగురు మహిళలను పట్టుకున్న పోలీసులు

**మిర్యాలగూడ నవభూమి జూలై 3:-** మిర్యాలగూడ మండలం గూడూరు గ్రామ శివారులోని మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ కార్యాలయం ఎదురుగా ఇంట్లో సక్కుబాయి అనే మహిళ ఇంటిలో గురువారం ఇద్దరు ఇంటి యజమానులు వ్యభిచారం నిర్వహిస్తున్నారనే సమాచారంపై వెళ్లి తనిఖీ రూరల్ పోలీసులు నిర్వహించారు. ఇద్దరు విటులు, ఆరుగురు మహిళలను పట్టుకున్నారు. వారి నుండి నాలుగు సెల్ ఫోన్లను, వెయ్యి రూపాయల నగదును స్వాధీనం పరుచుకొని కేసు నమోదు చేసినట్టు రూరల్ ఎస్ఐ లక్ష్మయ్య తెలిపారు.

నవభూమి
www.navabhoomi.in
7 హైదరాబాద్
మంగళవారం
01, జులై,2025

# మైండ్ కేర్ సెంటర్ కౌన్సిలింగ్ కార్యక్రమంలో డాక్టర్ బి. ప్రవీణ్ కుమార్ పిలుపు



**సిరిసిల్ల జులై 3 నవభూమి బ్యూరో** మైండ్ కేర్ అండ్ కౌన్సిలింగ్ సెంటర్ ప్రభుత్వ సాధారణ వైద్యశాల మరియు జిల్లా వైద్య ఆరోగ్య వైద్య శాఖ ఆధ్వర్యంలో కార్మికులకు మానసిక ఆరోగ్యంపై గ్రూప్ కౌన్సిలింగ్ కార్యక్రమాన్ని ప్రముఖ సైకాలజిస్ట్ కె. పున్నంచందర్ ఏర్పాటు చేసినారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖలో న్యూరో సైకియాట్రిస్ట్ గా పనిచేస్తున్న డాక్టర్ బి. ప్రవీణ్ కుమార్ హాజరై కార్మికులకు కౌన్సిలింగ్, చికిత్స పద్ధతులను గురించి వివరించారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రవీణ్ కుమార్ మాటడుతూ సమస్యలు ఎదురైనప్పుడు సానుకూల దృక్పథంతో ఆలోచించాలి అని అన్నారు. ప్రతి సమస్యకు పరిష్కారం ఉంటుందని తెలుపుతూ సమస్యపై కాకుండా వాటి పరిష్కార మార్గాలపై దృష్టి నిలపాలని అన్నారు. మద్యపాన వ్యసనం గురించి మాటాడుతూ దీనిపై కార్మికుల్లో అనేక అపోహలు ఉన్నాయని అన్నారు. ప్రభుత్వ వైద్యశాలలో తనను సంప్రదిస్తే వైద్యం అందించి మద్యపాన వ్యసనం నుండి విముక్తి కల్పిస్తామని తెలిపారు. తంబాకు నమలడం, బీడీ, సిగరెట్ త్రాగడం వల్ల అనేక శారీరక, మానసిక రుగ్మతలు వస్తాయని తెలిపారు. చెడు అలవాట్ల వల్ల గుండె, ఛాతీలో మంట, అల్సర్స్, కాలేయం దెబ్బతినడం, మెదడు, నరాలు దెబ్బతిని మానసిక, శారీరక అనారోగ్యం ఏర్పడుతుందని అన్నారు. సైకాలజిస్ట్ కె. పున్నంచందర్ మాట్లాడుతూ కార్మికుల్లో ఎక్కువగా నిద్ర సమస్యలు ఉన్నాయని తెలుపుతూ వాటిని పరిష్కరించేందుకు మందులు, కౌన్సిలింగ్ ఇస్తున్నట్లు తెలిపారు. ఎటువంటి సమస్యలు ఉన్నా ప్రభుత్వ సాధారణ వైద్యశాలలో తమను సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మైండ్ కేర్ అండ్ కౌన్సిలింగ్ సెంటర్ సైకాలజిస్ట్ కె. పున్నంచందర్ , సిబ్బంది రాపెల్లి లత, కొండ ఉమ, బుర్ర శ్రీమతి కార్మికులు పాల్గొన్నారు.

## దివ్యాంగుల కోసం ఉచిత ఉపకరణాల పంపిణీకి నోటిఫికేషన్

### దరఖాస్తుల గడువు జూలై 5 వరకు

**మహబూబాబాద్ టౌన్ జూలై 3, నవభూమి ప్రతినిధి:** రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగుల సంక్షేమం కోసం చేపట్టిన ప్రత్యేక పథకంలో భాగంగా, 2025%-%26 ఆర్థిక సంవత్సరానికి గాను శారీరక వైకల్యంగలవారు, అంధులు, మానసిక దివ్యాంగుల కోసం ఉచితంగా వివిధ ఉపకరణాలు పంపిణీ చేయనున్నారు. ఈ మేరకు మహిళ, శిశు, దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ, తెలంగాణ దివ్యాంగుల సహకార సంస్థ సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని అమలు చేయనున్నట్లు జిల్లా ఇంచార్జ్ డి.డబ్ల్యూ.ఓ శిరీష తెలిపారు. ఈ పథకంలో భాగంగా దివ్యాంగులకు అందజేయనున్న ఉపకరణాల్లో రెట్రోఫిటెడ్ మోటర్ వెహికల్స్, బ్యాటరీ వీల్ చైర్లు, మొబైల్ బిజినెస్ ట్రైసైకిల్స్, మినీ ట్రేడింగ్ ఆటో వెహికల్స్, హైబ్రిడ్ వీల్ చైర్ అటాచ్మెంట్ మరియు వీల్ చైర్స్, ల్యాప్‌టాప్‌లు (డిగ్రీ, హయ్యర్, టెక్నికల్ విద్యార్థుల కోసం), టాబ్లెట్లు, 5జీ స్మార్ట్‌ఫోన్లు, బోధన, అభ్యాసానికి సంబంధించిన ఉపకరణాలు ఉన్నాయి. ఈ అవకాశాన్ని మహబూబాబాద్ జిల్లాలోని అర్హులైన దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు. దరఖాస్తు చేసుకోవాలనుకునే వారు తమ పూర్తి వివరాలతో [https://tsobmms.cgg.gov.in] (https://tsobmms.cgg.gov.in) వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. దరఖాస్తుకు గడువు జూలై 5, 2025 వరకు పొడిగించబడిందని ఆమె పేర్కొన్నారు. సంబంధిత ధృవపత్రాలతో చేసిన దరఖాస్తులను జిల్లా ఎంపిక కమిటీ పరిశీలించి అర్హులైన దివ్యాంగులు లేదా విద్యార్థులను ఎంపిక చేస్తారు. ఎంపికైన వారి జాబితాను రాష్ట్ర కార్యాలయానికి పంపిన తరువాత, నియమ నిబంధనల ప్రకారం వారికి ఆయా ఉపకరణాలను ఉచితంగా పంపిణీ చేస్తారు. ఇతర వివరాల కోసం జిల్లా మహిళ, శిశు, దివ్యాంగులు మరియు వయోవృద్ధుల సంక్షేమ శాఖ కార్యాలయాన్ని సంప్రదించవచ్చని డబ్ల్యూ.ఓ శిరీష తెలిపారు. అదనపు సమాచారం కోసం ఫోన్ నంబర్ 8978698912 ద్వారా కార్యాలయ పనివేళల్లో సంప్రదించవచ్చన్నారు.

## మండల ఆర్యవైశ్య ఎన్నికల నోటిఫికేషన్ విడుదల

### కాటారం మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు అనంతుల శ్రీనివాస్



**కాటారం,జూలై 3 నవభూమి ప్రతినిధి:**జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండల ఆర్యవైశ్య సంఘం 2025 - 27 నూతన కార్యవర్గం ఎన్నిక కొరకు ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేసినట్లు మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు అనంతుల శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలియజేసారు. తేది. 05/07/2025 శనివారం రోజున ఉదయం 11.30 నుండి మధ్యాహ్నం 1.30 వరకు గారెపల్లి లోని అయ్యప్ప దేవాలయ ప్రాంగణంలో నామినేషన్ లు స్వీకరిబడునని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభలో రెండు సంవత్సరాలుగా జీవిత సభ్యత్వం ఉన్న వ్యక్తి మాత్రమే పోటీ చేయుటకు అర్హులని,పోటీ చేయు వ్యక్తి పై ఎలాంటి నేర చరిత్ర ఉండకూడదని పేర్కొన్నాడు. కాటారం మండలంలోని ఆసక్తి గల ఆర్యవైశ్య సోదరులు ముందుకు వచ్చి నామినేషన్ వేయాలని,మండలం లోని ఆర్యవైశ్య సోదర,సోదరీ మనులందరూ హాజరై ఇట్టి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరాడు. నామినేషన్ ప్రక్రియ ముగిసిన అనంతరం తుది జాబితా ఎలక్షన్ ఆఫీసర్ ప్రకటించడం జరుగుతుందని తెలిపాడు.

## హర్షం వ్యక్తం చేసిన స్కూల్ విద్యార్థులు



**పాలకుర్తి నవభూమి జూలై 03** జనగామ జిల్లా పాలకుర్తి మండలం శాతపురం గ్రామానికి చెందిన స్కూల్ విద్యార్థులు పాలకుర్తి లోని జిల్లా పరిషత్ ప్రభుత్వ పాఠశాలలో చదువుతుండగా,పాఠశాలకు వెళ్లేందుకు ప్రయాణ సౌకర్యాలు లేక విద్యార్థులు ఎన్నో ఇబ్బందులు పడేవారు. ఈ క్రమంలో గ్రామస్థులు స్థానిక ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో,ఎమ్మెల్యే ఆదేశాల మేరకు, ఆర్టీసి డిపో మేనేజర్ సహకారంతో ఎట్టకేలకు శాతపురం గ్రామానికి బస్సు సౌకర్యం లభించింది. ఈ సందర్భంగా గ్రామ విద్యార్థులు నియోజకవర్గ ఎమ్మెల్యేకు,సహకరించిన గ్రామస్తులకు విద్యార్థులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

## ఘనంగా ప్రపంచ టూ వీలర్ మెకానిక్ దినోత్సవం



**కాటారం,జూలై 3 నవభూమి ప్రతినిధి :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండల కేంద్రంలో టూ వీలర్ మెకానిక్‌లు అందరూ ఒక చోట సమావేశమై ప్రపంచ టూ వీలర్ మెకానిక్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు .సృష్టికర్త గాట్లెబ్ డైమ్లర్ జన్మదినం సందర్భంగా టూ వీలర్ మెకానిక్ ల దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా కాటారం మండల టూ వీలర్ మెకానిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అధ్యక్షుడు మాసెట్టి శ్రీనివాస్ జెండా ఆవిష్కరణ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం సభ్యులు ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపు కుంటూ స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు జ్యోతి రాజు,అధ్యక్షుడు మాసెట్టి శ్రీనివాస్,ఉపాధ్యక్షుడు సిద్ధం గణేష్,కార్యదర్శి దీకొండ నరేందర్,కోశాధికారి కనుకుల పూర్ణ చందర్,సలహాదారులు తోట శంకర్,పర్సవేన రాజేందర్,ప్రచార కార్యదర్శి కుసుమ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

### కంబాలపల్లి జడ్పీ హైస్కూల్‌లో ప్రతిభావంతులకు సన్మానం

# విద్యార్థుల ఉజ్వల భవిష్యత్‌కు దారి







**మహబూబాబాద్ టౌన్ జూలై 3, నవభూమి ప్రతినిధి:** మహబూబాబాద్ జిల్లా కంబాలపల్లి జడ్పీ హెచ్‌ఎస్ పాఠశాలలో గురువారం ఓ స్ఫూర్తిదాయక కార్యక్రమం జరిగింది. స్థానిక ఉపాధ్యాయులు రామసహాయం శ్రీధర్ రెడ్డి చొరవతో నూకల కృష్ణారెడ్డి మెమోరియల్ ట్రస్ట్ ద్వారా 2025 పదవ తరగతి పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు నగదు బహుమతులు, సర్టిఫికెట్స్ అందజేసి వారిని ఘనంగా సన్మానించారు.. వెంపటి విఘ్నేశ్ 565 మార్కులతో ప్రథమస్థానంలో నిలిచి రూ.10,000, ధనుంజయ్ 554 మార్కులతో రూ.6,000, శివకుమార్ 534 మార్కులతో రూ.4,000, అలాగే 500 మార్కులకుపైగా సాధించిన మరో 8 మంది విద్యార్థులకు రూ.1,000 చొప్పున నగదు బహుమతులు అందించారు. అలాగే జేఈఈ %-% 2025 ఫలితాల్లో ఐఐటీ సీట్లు సాధించిన సాయి లేఖ్య, ప్రశాంత్‌లను కూడా ట్రస్ట్ తరఫున ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి. ఉప్పలయ్య అధ్యక్షత వహించగా, ముఖ్య అతిథిగా జిల్లా విద్యాధికారి ఎ. రవీందర్ పాల్గొన్నారు. విద్యార్థులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులకు గౌరవం తీసుకొచ్చేలా చదువుకోవాలని, ప్రభుత్వ పాఠశాలలోనూ నాణ్యమైన విద్య అందుతోందని, ప్రతిభ ఎవరి సొత్తూ కాదని, పాఠ్యపుస్తకాలను అర్థవంతంగా చదివితే అవగాహన పెరిగి విజయం సాధించవచ్చని అన్నారు. బీర్ గ్రూప్ లెర్నింగ్, లిటిల్ టీచర్ విధానాల వల్ల విద్యార్థుల్లోని ప్రతిభ వెలికి వస్తుందని, ఈరోజు సన్మానించబడిన విద్యార్థులే దానికి నిదర్శనమని పేర్కొన్నారు. విశిష్ట అతిథిగా హాజరైన రిటైర్డ్ ఎయిర్ కమాండర్ నూకల నరేంద్ర రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులు ఉపాధ్యాయుల సేవలను వినియోగించుకొని మంచి ర్యాంకులు సాధించాలని, శారీరక వ్యాయామం, పోటీ తత్వం అభివృద్ధి చేసుకుంటే శాస్త్రవేత్తలు, అంతరిక్షయోధులుగా ఎదగగలరని ప్రేరేపించారు. కార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యాయుడు సుదర్శన చారి పాఠశాల తెలుగు మీడియం విద్యార్థుల కోసం రూ.3,000 నగదు విరాళాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి బి. అప్పారావు, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్, మాజీ విద్యా కమిటీ చైర్మన్ చిరంజీవి, ఉపాధ్యాయులు సోహన్ బి, కాసం శ్రీనివాసరావు, తిరుపతి, ఎ. సతీష్ కుమార్, ఎ. సోమేశ్వర్, ఓ. ఝాన్సీ, వీరభద్రం, కవిత, వ్యాయామ ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు, బి. కృష్ణమూర్తి, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జి. లక్ష్మి, ఉపాధ్యాయులు ఆవునూరి రవి,కంబాలపల్లి గ్రామస్థులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పెద్దఎత్తున హాజరై ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థుల ప్రతిభకు ఇది ప్రగాఢ నిదర్శనంగా నిలిచింది.

# కుల విభజన కాదు,ఏకీకృత విద్య కావాలి

- టిపిటిఎఫ్ మహబూబాబాద్ జిల్లా కార్యదర్శి రాచకొండ ఉపేందర్






**మహబూబాబాద్ టౌన్, జూలై 3, నవభూమి ప్రతినిధి:** విద్యార్థుల మధ్య కులాల అంతరాన్ని పెంచే ఇంటిగ్రేటెడ్ పాఠశాలల విధానం కాకుండా, ఒకే తరగతిలో అన్ని సామాజిక వర్గాల పిల్లలకు బోధించే ఇంటిగ్రేటెడ్ స్కూల్ విధానం అమలు చేయాలని తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ (టిపిటిఎఫ్) మహబూబాబాద్ జిల్లా కార్యదర్శి రాచకొండ ఉపేందర్ డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం కులానికో గురుకులం ఏర్పాటు చేసి విద్యార్థుల మధ్య కుల విభజనను పెంచిందని, ప్రస్తుత ప్రజా ప్రభుత్వం కూడా గత విధానాలను అనుసరిస్తూ కేవలం పేరు మార్చి ఇంటిగ్రేటెడ్ స్కూల్ అని పిలుస్తూ కులాలవారీగా విద్యార్థులను విభజించే ప్రయత్నం చేస్తోందని ఆయన విమర్శించారు. అన్ని సామాజిక వర్గాల విద్యార్థులు ఒకే తరగతిలో చదువుకునే విధానం అవసరమని ఆయన పేర్కొన్నారు. టిపిటిఎఫ్ మహబూబాబాద్ మండల సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా ఆయన కంకరబోడ్, నందమూరి నగర్, ఇందిరాకాలనీ, ముదుపుగల్, అయోధ్య, అమనగల్, సింగారం, వి.ఎస్. లక్ష్మీపురం, జంగిలిగొండ, పర్వతగిరి, శనిగపురం పాఠశాలలను సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కంకరబోడ్‌లో మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చినప్పటికీ, అధికారంలోకి వచ్చి 20 నెలలు గడిచినా పిఆర్‌సి ప్రకటించకపోవడం విచారకరమని అన్నారు. పిఆర్‌సి గడువు జూలై 1, 2025 నాటికి రెండేళ్లు పూర్తయిన నేపథ్యంలో, తక్షణమే పిఆర్‌సి కమిటీ నుండి నివేదిక తెప్పించి 51% ఫిట్‌మెంట్ ప్రకటించాలని ఉపేందర్ కోరారు. అలాగే, పెండింగ్ బిల్లుల చెల్లింపుకు నెలకు 700 కోట్లు విడుదల చేస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చినప్పటికీ, కేవలం 180 కోట్లు మాత్రమే విడుదల చేసిందని, మిగిలిన 520 కోట్లు వెంటనే విడుదల చేసి పెండింగ్ బిల్లులను చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టిపిటిఎఫ్ మహబూబాబాద్ మండల అధ్యక్షులు ఘనపురం బిక్షపతి, ప్రధాన కార్యదర్శి సారెడ్డి రామలింగారెడ్డి, జెడ్పిహెచ్‌ఎస్ కంకరబోడ్ ప్రధానోపాధ్యాయులు మాలోతు కోట్యానాయక్, ఉపాధ్యాయ బృందంతో పాటు టిపిటిఎఫ్ కార్యకర్తలు వివిండి రఫీక్, ఎన్. దుర్గయ్య, బి. రంజిత్ కుమార్, కదారి మల్లికార్జున్, జి. అరుణ, బి. రవి, బి. మోహన్, జి. శృతి, పి. సుచరిత, సోఫియా తస్వీర్ తదితరులు పాల్గొన్నారు.

# గూడూరు బస్టాండ్‌లో చినుకు పడితే చిత్తడే

**మహబూబాబాద్ టౌన్ జూలై 3, నవభూమి ప్రతినిధి:** వర్షాకాలం వచ్చినంత మాత్రాన ప్రజలు ఇబ్బంది పడాల్సిన అవసరం ఏమీ ఉండదు. కానీ మహబూబాబాద్ జిల్లాలోని గూడూరు గ్రామ బస్టాండ్ పరిస్థితి చూస్తే మాత్రం అది నిజం కాదనే అనిపిస్తుంది. ఒక్క చినుకే చాలుబస్టాండ్ ప్రాంతం మొత్తం నీటితో మునిగి బురదమయమై ప్రయాణికులకు తడవు, కష్టాలు, ప్రమాదాల మూడింటినీ మేళవించి పెడుతోంది. వర్షం కురిస్తే బస్టాండ్ ప్రాంగణం లో ఎటు చూసినా నీరు నిలిచిపోయిన గుంతలు, బురద తిప్పలు దర్శనమిస్తుంటాయి. రోడ్డు పూర్తిగా మట్టి నేలతో ఉండటంతో చిన్న వానకే బురద జలగలాడుతుంది. బస్సులు నిలుచునే చోట ఎక్కడ పడితే అక్కడ నీటి నిల్వలు ఏర్పడుతున్నాయి. ఇది కేవలం ప్రయాణికులకు అసౌకర్యం మాత్రమే కాదు, చిన్నారులు, వృద్ధులు జారి పడే ప్రమాదం కూడా ఉంది. ప్రతి అడుగూ ప్రమాదంగా మారుతున్న నేపథ్యంలో తల్లిదండ్రులు, ప్రయాణికులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బస్టాండ్‌లో బస్సుల కోసం వేచి ఉండే ప్రయాణికులకు ఓ వైపు బురద, మరోవైపు శుభ్రత లేకపోవడం, నీరు మిగలిపోవడం అన్నీ కలిసి గూడూరు బస్టాండ్‌ను ఉపేక్షించలేని దుస్థితికి నెట్టేస్తున్నాయి. ఇప్పటికే మట్టి నేలపై బస్సుల తిరుగుడు వల్ల లోతైన గుంతలు ఏర్పడగా, వర్షాలతో అవి పెద్ద పెద్ద నీరుకుంటలుగా మారాయి. ఇప్పటికైనా సంబంధిత రవాణా శాఖ, గ్రామ పంచాయితీ, ప్రజా ప్రతినిధులు స్పందించి తక్షణ చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతో ఉంది. బస్టాండ్‌కు తగిన నిర్మాణం, తాత్కాలిక మట్టిపొయ్యడం కాకుండా శాశ్వత రహదారి ఏర్పాటుచేయడం, నీరు నిలవకుండా చర్యలు తీసుకోవడం కీలకం. గూడూరు మండలానికి ఇది ఏకైక బస్టాండ్. మండలంలోని పలు గ్రామాల ప్రజలు ఇక్కడి నుంచే ఇతర ప్రాంతాలకు బస్సు ప్రయాణం చేస్తుంటారు. ఇలాంటి ముఖ్యమైన రవాణా కేంద్రం ఎన్నో ఏళ్లుగా ఇలా నిర్లక్ష్యంగా ఉండటం దురదృష్టకరం. ప్రయాణికుల భద్రతను దృష్టిలో ఉంచుకొని తక్షణమే సంబంధిత అధికారులు మెరుగైన చర్యలు చేపట్టాలని గూడూరు ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ప్రతి వానకూ ఓ కొత్త సమస్య, ప్రతి చినుకూ ఓ ప్రమాదంగా మారిన గూడూరు బస్టాండ్ పరిస్థితిని ఇప్పటికైనా మార్చాలా, వద్దా అనేది అధికారులు తేల్చుకోవలసిన సమయం ఆసన్నమైంది.








## 7న మాదిగల ఆత్మగౌరవ దినోత్సవం

**జనగామ నవభూమి ప్రతినిధిజులై(03)**హక్కుల నక్షత్రం పొడిసిన రోజు భయం గుండెల్లో ధైర్యం నింపిన రోజు దగా పడిన మాదిగ గుండెలన్నీ ఎలుగెత్తి దండోరేసిన రోజు. సమానత్వం కోసం సమర శంఖం పూరించిన రోజు. ఆకలిపై పోరు జెండాలు ఎగరేసిన రోజు అన్యాయంపై గొంతులు ఎత్తిన రోజు పిడికెడు మెతుకుల బతుకుల కోసం పిడికిలి బిగించిన రోజు చీకటి బతుకులపై వెలుగు బవుటాలు తెచ్చిన రోజు ప్రాణాలను పణంగా పెట్టి త్యాగాలకు సిద్ధమైన రోజు పీడిత జాతుల విముక్తి పోరుకు దారులు వేసిన రోజు ధరణి దద్దరిల్లేలా కాళ్ళ చెప్పులు శబ్దం చేసిన రోజు కరుడుగట్టిన స్వార్థపు కొండలను బద్దలు కొట్టిన రోజు ఈదుమూడి తల్లి ఒడి మాదిగల "బడి"మన జ్ఞాన నిధి సమాన వాటా కోసం సమిదలైన అమరులను స్మరించుకునే రోజు మన జాతికి పర్వదినం మన అందరికీ పండగ రోజు..మాదిగల ఐక్యత వర్ధిల్లాలి .మాదిగల "ఐ"కాన్, ఇదుమూడి జోహార్లు అమరులకు జోహార్లు అమరవీరులు జై మాదిగ, జైజై మాదిగ, జై భీమ్ మాదిగ (కన్నారపు. పరశురాములు జనగామ జిల్లా 8555929909)

## గ్రామాల్లో గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు

### తండోప తండాలుగా మొక్కలు తీర్చుకుంటున్న భక్తులు



**కాటారం,జూలై 3,నవభూమి ప్రతినిధి:**గ్రామాల్లో వర్షాకాలం వచ్చిందంటే చాలు గ్రామ దేవతలకు మొక్కలు తీర్చు కోవడం గ్రామ ప్రజలు,రైతులకు ఆనవాయితీగా వస్తుంది. ఆషాఢమాసం బోనాల సీజన్ అయిన ఆది, గురువారాల్లో కాటారం మండలం లోని పలు గ్రామాలలో బోనాల సందడి నెలకొంది. మండల వ్యాప్తంగా గురువారం గ్రామాల్లో ఇంట్లో ప్రత్యేక పాత్రలలో బోనం సిద్ధం చేశారు. మహిళలు బోనం ను నెత్తి పైన పెట్టుకొని మంగళ వాయిద్యాలతో ఇంటి నుండి ఊరేగింపు గా గ్రామ దేవత పోచమ్మ గుడికి తరలి వెళ్లి పసుపు,కుంకుమ,పూలతో ప్రత్యేక పూజలు నిర్వహించి టెంకాయ కొట్టి,బోనం తో నైవేద్యం సమర్పించారు. కోళ్లు, మేకల ను తల్లికి సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అదే విధంగా కాటారం మండలంలో మహిళలు తలపై బోనం పెట్టుకొని డప్పు వాయిద్యాలతో ఊరేగింపుగా గ్రామ దేవత పోచమ్మ గుడికి వెళ్లి ప్రదక్షిణాలు చేసి మొక్కులు సమర్పించి కుటుంబ సభ్యులు అందరూ చల్లగా ఉండేల దీవించమని వేడు కున్నారు. పాడి పంటలు సమృద్ధిగా పండాలని మొక్కుకున్నారు.

## మల్లికార్జున ఖర్గే సభను విజయవంతం చేయండి: టీపీసిసి ప్రధాన కార్యదర్శి దుద్దిళ్ళ శ్రీనుబాబు



**కాటారం,జూలై 3 నవభూమి ప్రతినిధి:**హైదరాబాద్ లోని ఎల్ బి స్టేడియం లో జూలై 4 వ తేదీ శుక్రవారం రోజున ఏర్పాటు చేస్తున్న అఖిల భారత కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే సభను విజయవంతం చేయాలని గ్రామ శాఖ అధ్యక్షులకు మొదలు మండల పార్టీ అధ్యక్షులకు, ఎంపీపీ లకు,టీపీసీసీ ప్రధాన కార్యదర్శి దుద్దిళ్ళ శ్రీను బాబు కాటారం మండలం ధన్వాడ గ్రామం లో ఏర్పాటు చేసిన సమావేశంలో పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా శ్రీనుబాబు మాట్లాడుతూ గ్రామ శాఖ అధ్యక్షులతో అఖిల భారత కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మల్లికార్జున కర్గే నేరుగా సమావేశం కావడం దేశంలోనే మొదటిసారి అని శ్రీను బాబు తెలిపారు. తెలంగాణ అనంతరం దేశవ్యాప్తంగా ఈ తరహా కార్యక్రమాలు ఉంటాయన్నారు. ఇంతటి ప్రాముఖ్యత ఉన్న సభ నేపథ్యంలో పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేస్తున్నట్లు వివరించారు. శనివారం రోజున మధ్యాహ్నం 3:00 గంటలకు మంథని నియోజకవర్గంలోని గ్రామ శాఖ అధ్యక్షులు,మండల శాఖ అధ్యక్షులు,జిల్లా శాఖ అధ్యక్షులు ఒకరినొకరు సమాచారం చేర వేసుకొని సమన్వయంతో సభకు హాజరు కావాలని టిపిసిసి ప్రధాన కార్యదర్శి దుద్దిళ్ళ శ్రీనుబాబు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు, అభిమానులు,యూత్ కాంగ్రెస్ నాయకులు, మహిళా కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం



**కల్వకుర్తి,జులై 3,నవభూమిన్యూస్:** ఐక్యత ఫౌండేషన్ చైర్మన్,కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు టాస్క్ సిఓఓ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డిసహకారంతో ఐక్యత ఫౌండేషన్ మరియు శంకర నేత్రాలయ చెన్నై వారు కల్వకుర్తి పట్టణ కేంద్రంలోని సి కె ఆర్ ఫంక్షన్ హాల్ నిర్వహించడంజరుగుతుందని తెలిపారు. జులై 05వ తేదీ శనివారం నుండి 13వ తేదీ ఆదివారం వరకు. ప్రతి రోజు ఉదయం 09:00 గం.ల నుండి మధ్యాహ్నం 01:00 గం.ల కంటి పరీక్షలు చేయించుకోవాలని,ఉచిత కంటి పరీక్షలతో పాటు,కంటిశుక్లాలకుఉచితంగా ఆపరేషన్ చేయడం జరుగుతుందని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని టాస్క్ సిఓఓ ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి కోరారు.

## క్యాతనపల్లి ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గం ఎన్నిక




**రామకృష్ణాపూర్-నవభూమి** పట్టణంలోని క్యాతనపల్లి ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గం ఖరారైంది.డబ్ల్యూజెఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి పార్వతి రాజేష్,జిల్లా అధ్యక్షులు పార్వతి సురేష్, క్యాతనపల్లి ప్రెస్ క్లబ్ కో ఆర్డినేటర్ దుస్స శివప్రసాద్ లు కమిటీ వివరాలు ప్రకటించారు.అధ్యక్షులుగా కలువల శంకర్, వర్కింగ్ ప్రెసిడెంట్ గా రామిల్ల శ్రీనివాస్,ఉపాధ్యక్షులుగా తూముల భవిష్యత్, రామిడి సాయి సృజన్, కోశాధికారిగా పరికిపండ్ల రాజు, ప్రధాన కార్యదర్శిగా మెరుగు నారాయణ, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా ఎలకటూరి నరేష్, సంయుక్త కార్యదర్శిగా పోలుదాసరి శ్రీనివాస్, సహాయ కార్యదర్శులు గా కందుల ప్రవీణ్, నరెడ్ల వెంకన్న,ముఖ్య సలహాదారులుగా కనుకుంట్ల సుభాష్ ,సభ్యులుగా కరెడ్ల రఘు, దండు సదానందం, మామిడాల రవి, పినుమల్ల సుదర్శన్ లను ఏకగ్రీవంగా సభ్యులందరి సమక్షంలో ఎన్నుకున్నట్లు వారు ప్రకటించారు. ఈ సందర్భంగా అధ్యక్ష , ప్రధాన కార్యదర్శు లు మీడియాతో మాట్లాడుతూ, క్యాతనపల్లి ప్రెస్ క్లబ్ అభివృద్ధికి కృషి చేస్తామని, జర్నలిస్టులందరూ ఐక్యంగా ఉండాలని కోరారు. సంఘ సభ్యులందరి భవిష్యత్తు కోసం త్వరలో రాష్ట్ర, జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన సంఘాలతో చర్చించనున్నట్లు చెప్పారు.అనంతరం అతిథులుగా విచ్చేసిన బిఎంఎస్ అనుబంధ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఆఫ్ ఇండియా మంచిర్యాల జిల్లా అధ్యక్షులు పార్వతి సురేష్ మాట్లాడారు.నిజాయితీగా వార్తలు రాయడంతో పాటు ఇన్వెస్టిగేషన్ జర్నలిజం చేసినప్పుడే విలేకరికి సరైన గుర్తింపు వస్తుందని ఆ దిశగా అందరూ కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. స్వార్థపు అధికారులు , రాజకీయ నాయకులు జర్నలిస్టులలో అనైక్యతకు ప్రయత్నిస్తూ ఉంటారని అలాంటి వారి పట్ల జాగ్రత్తగా ఉండాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో డబ్ల్యూజెఐ జిల్లా కోశాధికారి దేగ ఆంజనేయులు, ఉపాధ్యక్షులు మామిడాల రవి, జిల్లా నాయకులు మాసు రాకేష్,క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

## మండలంలో సబ్ కలెక్టర్ పర్యటన



**మహాముత్తారం జులై 3 నవభూమి:** మహాముత్తారం మండలంలో గురువారం రోజు కాటారం రెవెన్యూ డివిజన్ సబ్ కలెక్టర్ మయంక్ సింగ్ పర్యటించారు. మండల కేంద్రంలో నూతనంగా నిర్మితమవుతున్న ఎంపీడీవో కార్యాలయం మరియు కస్తూరిబా పాఠశాల భవనములను తనిఖీ చేశారు. అదేవిధంగా హాస్పిటల్ దగ్గర లోలెవెల్ వంతెనను పరిశీలించారు. మండల తహసిల్దార్ శ్రీనివాస్ సబ్ కలెక్టర్ తో మాట్లాడుతూ అకాల వర్షాలకు లోలెవెల్ వంతెన వలన ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారని తెలిపారు. వీలైనంత త్వరగా దీనిని హైలెవెల్ వంతెన నిర్మించాలని సబ్ కలెక్టర్ ను కోరడం జరిగిందని తాసిల్దార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాసరావు, డిప్యూటీ తాసిల్దార్ సందీప్, ఆర్ఐ భాస్కర్ పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సహకారంతో సీఎంఆర్ఎఫ్ చెక్కు పంపిణీ



**కల్వకుర్తి,జులై 3 నవభూమిన్యూస్:**-కల్వకుర్తి మండలం మార్చాల గ్రామానికి చెందిన పొట్లపల్లి మాధవి అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స చేసుకున్న అనంతరం ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేసుకోవడంతో 25 వేల రూపాయల చెక్కును కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సహకారంతో కాంగ్రెస్ పార్టీ నాయకులు గోలీ సురేందర్ రెడ్డి,సంతు యాదవ్,శివకృష్ణ లతో కలసి యువజన కాంగ్రెస్ నాయకుడు ఫక్రుద్దీన్ బాధితురాలికి అందజేశారు.ఫక్రుద్దీన్ మాట్లాడుతూ కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సహకారంతో నియోజకవర్గం అభివృద్ధి పథంలో నడుస్తుందని అన్నారు.

## 1వ వార్డు సమస్యలు పరిష్కరించాలి: బీజేపీ నాయకులు



**కల్వకుర్తి,జులై 3,నవభూమిన్యూస్:**-కల్వకుర్తి పట్టణంలో ఒకటో వార్డులో బిజెపి నాయకులు మార్నింగ్ వాక్ లో అక్కడి ప్రజలను కలువగా అక్కడి ప్రజలు పలు సమస్యలను వారి దృష్టికి తీసుకురావడం జరిగింది.హైదరాబాద్ రోడ్డు నుంచి బచ్పన్ స్కూల్ వెళ్లే దారిలో గంగాధర్ ఇంటి వరకు అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ కావాలని 15 సంవత్సరాలుగా ఇండ్ల నిర్మాణం అయినప్పటికీ మురికి కాలువల నిర్మాణం కాలేదు తక్షణమే పనులు నిర్మించాలని కోరడం జరిగింది.ఒకటవ వార్డు బచ్పన్ స్కూల్ ముందు ఉన్న ఇండ్ల మధ్యలోకి వర్షపు నీరు మురికి నీరు నిలుచుచున్నవి అట్టి నీరుని బయటకు పోకుండా పక్క ల్యాండ్ వాళ్ళు ఇల్లు నిర్మాణం చేయడం జరిగింది.అందువలన వర్షపు నీరు మురికి నీరు అక్కడికి చేరుకొని చెరువుల తలపిస్తుంది ఇండ్లలోకి వర్షపు నీరు మురికి నీరు పాములు ఇతరతర జీవరాసులు ఇండ్లలోకి రావడం జరుగుతుంది తద్వారా ప్రజలు భయభ్రాంతులకు గురి అవుతున్నారు.ఒకటో వార్డు లో గల వాసవి రైస్ మిల్ ముందు అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పైపులు కలవు అట్టి పైపు లు వృధాగా ఉన్నందున తక్షణమే అక్కడ డ్రైనేజీ పనులు ప్రారంభించవలసిందిగా భారతీయ జనతా పార్టీ నాయకులు కల్వకుర్తి మున్సిపల్ ఏఈఈ షబ్బీర్ అహ్మద్ గారికి వినతి పత్రం ఇవ్వడం జరిగింది.ఈ కార్యక్రమంలో బిజెపి పట్టణ అధ్యక్షుడు గన్నోజు బాబిదేవ్ సీనియర్ నాయకులు గుర్రాల రాంభూపాల్ రెడ్డి,నరెడ్ల శేఖర్ రెడ్డి కృష్ణ గౌడ్, గంగాధర్, పట్టణ ప్రధాన కార్యదర్శి నాప శివ కాలనీ వాసులు పాల్గొన్నారు.

## డ్రైనేజీ కాలువలు లేక ఇక్కట్లు

**మహాముత్తారం జులై 3 నవభూమి:** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాముత్తారం మండలం యామనపల్లి చౌరస్తాలో మురుగునీరు కంపు కొడుతుంది. డ్రైనేజీ కాలువలు లేక నీరంతా రోడ్డుపై నిలిచి ప్రయాణికుల రాకపోకలకు ఇబ్బందిని కలిగిస్తుందని జనాలు వాపోతున్నారు. యామనపల్లి చౌరస్తాలో నీళ్లు నిలువ ఉండకుండా అధికార యంత్రాంగం గ్రామంలో డ్రైనేజీ కాలువలు నిర్మించాలని పారిశుద్ధ్య నిర్వహణ చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.



## మండలంలో ఊసే లేని
# ఇందిరమ్మ ఇండ్ల జాబితా

◆ కాంగ్రెస్ ప్రభుత్వంపై మండిపడ్డ బిఆర్ఎస్ పార్టీ మండల యూత్ అధ్యక్షులు రామిల్ల కిరణ్

**కాటారం,జూలై 3 నవభూమి ప్రతినిధి:**జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండలం కేంద్రంలో గురువారం రోజున బిఆర్ఎస్ పార్టీ యూత్ అధ్యక్షుడు రామిళ్ల కిరణ్ మాట్లాడుతూ..కాటారం మండలంలో ఇప్పటివరకు ఇందిరమ్మ ఇళ్ల ఊసే లేకపోవడం బాధాకరం అని,అంగట్లో అన్నీ ఉన్నా అల్లుని నోట్లో శని అనే రీతిలో ఇందిరమ్మ ఇండ్ల పరిస్థితి ఉందని మండిపడ్డాడు.ఈ రోజు చూసు కున్నట్లయితే త్వరలో రెండో దశ ఇందిరమ్మ ఇండ్లు ప్రారంభమని పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పత్రిక ప్రకటన ఇవ్వడం జరిగిందని, మరి ఇక్కడ చూసు కున్నట్లయితే కాటారం మండలంలో మొదటి దశ ఇందిరమ్మ ఇండ్లు ఎవరికి ఇచ్చారో మేనిఫెస్టో కమిటీ చైర్మన్ రాష్ట్ర మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు చెప్పాలని, మరి కాంగ్రెస్ పార్టీ నాయకుల మాటలు చూస్తుంటే రాబోయే మూడేళ్లలో 20 లక్షల ఇళ్లను పూర్తి చేస్తామని చెప్తున్నారు. కానీ ఇక్కడ "రెండు" ఇండ్లు కూడా ఇచ్చిన పరిస్థితి లేదు.అదే విధంగా ఇప్పటికే ఈ రాష్ట్రంలో రెండు లక్షల 37 వేల ఇండ్లను ఇవ్వడం జరిగింది అవి పూర్తయ్యే దశలో ఉన్నాయని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి చెప్పడం జరిగింది కాని మరి ఈ మంథని నియోజకవర్గం కాటారం మండలం కు సంబంధించి మొదటి దశ ఇందిరమ్మ ఇండ్లు ఎక్కడికి పోయాయని,వచ్చిన ఇల్లు ఎవరి జేబు లోకి పోయినవో చెప్పాలి అని డిమాండ్ చేశారు. ఈ రోజు అర్హులైన నిరుపేదలు ఇల్లు కోసం వేచి చూస్తున్నారు మరి రాజకీయ అవసరాల కోసం ఎలక్షన్ లో ఓట్ల కోసం ఎలిజిబిలిటీ లిస్ట్ అని ఇచ్చారు కానీ ఇప్పటివరకు అర్హులకు ఒక్క ఇండ్లు కూడా సాంక్షన్ చేసిన దాఖలాలు లేవని,మరి పక్క నియోజకవర్గాలను చూస్తే అక్కడ ఒకటో రెండో ఊరుకి పదో ఇందిరమ్మ ఇండ్లు ప్రొసీడింగ్ లు లబ్ధి దారులకు ఇస్తున్నారు కానీ ఈ కాటారం మండలం లో మంథని నియోజకవర్గంలో ఇప్పటి వరకు లబ్ధిదారుల



ఎంపిక ఎందుకు జరగడం లేదు దీని వెనకాల ఉన్న కారణాలేంటో ప్రజలకి చెప్పాలి అని పేర్కొన్నాడు.గతంలో ఇదే నియోజక వర్గంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంలో ఇండ్ల స్కామ్ కూడా జరిగింది మరి ఇప్పుడు చూస్తే ప్రభుత్వం నుండి మంత్రి ఏమో ఇందిరమ్మ ఇండ్లు ఇచ్చామని అంటున్నారు కానీ ఈ ప్రాంతంలో ఇప్పటి వరకు ఒక్క ఇల్లు కూడా సాంక్షన్ కాలేదంటే దీంట్లో శ్రీధర్ బాబు,శ్రీనుబాబు అనుచరుల హస్తమేమైనా ఉందా అన్న సందేహము రాక మానదనీ, మొన్నటికి మొన్న పేపర్ వార్తల్లో చూసినట్లయితే ఇంటికి లక్ష రూపాయలు చొప్పున కాంగ్రెస్ పార్టీ నాయకులు వసూలు చేస్తున్నారని,ఒక వేళ ఇల్లు కావాలంటే లక్ష రూపాయలు ఇస్తేనే వస్తాయంటే ఆ విషయమైనా చెప్పండని,లేదా మోస పూరితమైన మాటలతో పబ్బం గడుపు తున్నామని నాయకులు ఈ ప్రాంత ప్రజలకు క్షమాపణ చెప్పాలని బిఆర్ఎస్ పార్టీ పక్షాన డిమాండ్ చేస్తున్నాం అని అన్నాడు.

## డాక్టరేట్ అందుకున్న వంగూరి యాదవ రెడ్డికి ఘన సత్కారం

◆ ఘనంగా నిర్వహించిన సన్మాన కార్యక్రమం - మానవతా విలువలకు నిలువెత్తు నిదర్శనం వంగూరి యాదవ రెడ్డి

**షాద్‌నగర్ నవభూమి ప్రతినిధి :**ఆసియా ఇంటర్నేషనల్ కల్చర్ అండ్ రీసెర్చ్ యూనివర్సిటీ అందించిన గౌరవ డాక్టరేట్‌ను అందుకున్న ప్రముఖ హ్యూమనిస్ట్, సామాజిక కార్యకర్త వంగూరి యాదవ రెడ్డి ని ఘనంగా సత్కరించారు.ఈ సందర్భంగా నేషనల్ హ్యూమన్ రైట్స్ అండ్ సోషల్ జస్టిస్ కమిషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సన్మాన కార్యక్రమంలో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సగ్గు వేణుమాధవ్, రాష్ట్ర అధికార ప్రతినిధి మరియు ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ కొమ్ము వెంకన్న బాబు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సామాజికవేత్త డాక్టర్ కొమ్ము వెంకన్న బాబు మాట్లాడుతూ వంగూరి యాదవ రెడ్డి మానవతా విలువలకు జీవ రూపం. కుల, మత, ప్రాంత భేదాలను త్రోసి, ప్రతి ఒక్కరిని సమానంగా ప్రేమించే తత్వాన్ని ఆయన అలవర్చుకున్నారు. సామాజిక సేవ అంటే ఆదర్శం ఎలా ఉండాలో ఆయన చూపించారు. గౌరవ డాక్టరేట్ ఆయన సేవలకు సముచిత గుర్తింపు అని ప్రశంసించారు. ఇక సగ్గు వేణుమాధవ్ మాట్లాడుతూ.. ఈ తరం యువతకి వంగూరి గారి జీవితం ఒక మార్గదర్శక శక్తి. నిస్వార్థంగా సేవ చేసే వ్యక్తులకు ఈ సమాజం గౌరవం ఇచ్చే రోజు వచ్చింది. ఇది మానవ హక్కుల పోరాటానికి నూతన స్ఫూర్తినిస్తుంది," అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా వంగూరి యాదవ రెడ్డి కి శాలువా కప్పి, సన్మాన పత్రం అందజేశారు. కార్యక్రమంలో పలువురు సామాజిక కార్యకర్తలు, ఘట్కేసర్ మాజీ వార్డ్ మెంబర్ సగ్గు సాయికుమార్, బెంజు సరియా పేపర్ మిల్ ఉద్యోగి రమణయ్య,



సత్యనారాయణ గుప్తా, డేవిడ్ కాటేపాగ వినయ్ కుమార్ ,న్యాయవాదులు, యువత తదితరులు పాల్గొన్నారు. ఆయనకు శుభాకాంక్షలు తెలుపుతూ పలువురు ప్రసంగించారు.సమాజ మార్పుకు కట్టుబడిన వంగూరి యాదవ రెడ్డికి గౌరవ డాక్టరేట్ రావటం నిజమైన సామాజిక న్యాయానికి సంకేతంగా భావిస్తున్నారు పలువురు.

# నిధులు గోల్‌మాల్

**మంచిర్యాల, నవభూమి:** జిల్లా కేంద్రంలోని హైటెక్‌సిటీ కాలనీలో ఉన్న 'మంచిర్యాల క్లబ్' లో పెద్ద మొత్తంలో నిధులు గోల్‌మాల్ అయినట్లు తెలుస్తోంది. రిక్రియేషన్ పేరిట నిర్వహిస్తున్న క్లబ్‌లో పేకాటే ప్రధానంగా కార్యకలాపాలు సాగుతుండగా, జిమ్, స్విమ్మింగ్ పూల్, షటిల్ కోర్టు కూడా అందుబాటులో ఉన్నాయి. ఇక్కడ సభ్యత్వం పొందాలంటే పెద్దమొత్తంలో సభ్యత్వ రుసుం చెల్లించాల్సి ఉంటుంది. క్లబ్‌కు అనుసంధానంగా బార్ కూడా ఉండటంతో పేకాట ఆడుతూ మద్యం సేవించడం ఇక్కడ ఆనవాయితీగా వస్తోంది. ఇందులో రాజకీయ ప్రముఖులు, ప్రభుత్వ ఉద్యోగులు, రియల్ ఎస్టేట్, వడ్డీ వ్యాపారులు సభ్యులుగా ఉన్నారు. ఇక్కడ పేకాట నిత్యకృత్యమన్న విషయం రామగుండం కమిషనరేట్ పోలీసుల దాడుల్లో వెల్లడైంది.ఖరీదైన సభ్యత్వం....మంచిర్యాల క్లబ్‌లో సభ్యత్వం అత్యంత ఖరీదైంది. డబ్బులు కట్టగలిగే స్తోమత ఉంటే చాలు.. ఎలాంటి అర్హత లేకపోయినా ఇక్కడ సభ్యత్వం తీసుకోవచ్చు. ప్రస్తుతం మంచిర్యాల క్లబ్‌లో సభ్యత్వం తీసుకోవాలంటే రుసుం కింద 1.5 లక్షల రూపాయలు వసూలు చేస్తున్నారు. పేకాట వ్యసనం ఉన్నవారు స్తోమత లేకపోయినా ఫైనాన్స్‌ల్లో అప్పులు తెచ్చి మరీ సభ్యత్వం తీసుకుంటారని వినికిడి. మంచిర్యాల క్లబ్‌లో ప్రస్తుతం 750కుపైగా సభ్యులు ఉన్నారు. క్లబ్‌లో లక్షలు చెల్లించి సభ్యత్వం తీసుకున్న వారిలో అనేక మంది పేకాటలో నష్టాలు వచ్చి రోడ్డున పడ్డవారేనన్న ప్రచారమూ ఉంది. సంపన్నుల సంగతి పక్కన బెడితే మేకపోతు గాంభీర్యం ప్రదర్శించి ఉన్నది పోగొట్టుకున్న వారే ఇక్కడ అధికంగా ఉన్నట్లు సమాచారం.నిబంధనలకు పాతర...రిక్రియేషన్ పేరిట కొనసాగుతున్న మంచిర్యాల క్లబ్‌లో రమ్మీ పేరిట జూదం ఆడుతుంటారని సమాచారం. ఒక్కో గేమ్‌కు మూడువేల రూపాయల చొప్పున చెల్లిస్తూ, పెద్దమొత్తంలో పేకాట రాయుళ్లు పందెం కాస్తుంటారు. ప్రతీరోజు దాదాపు 100 మంది వరకు ఇక్కడ పేకాట ఆడుతుంటారు. వీటికి అదనంగా క్లబ్ నిర్వాహకులు సభ్యులకు రిక్రియేషన్ టూర్లు ఏర్పాటు చేస్తుంటారు. సాయంత్రం వేళ వందలాది మంది పేకాట కోసం ఇక్కడికి వస్తుంటారని సమాచారం. అయితే నేరుగా డబ్బులు టేబుల్‌పై ఉంచకుండా కాయిన్‌లు ఉపయోగిస్తూ గేమ్ ఆడుతుంటారు.పోలీసుల దాడుల్లో పట్టుబడ్డ పేకాట రాయుళ్లు...రామగుండం కమిషనరేట్ పోలీసులు 2019 జూన్ 3న మంచిర్యాల క్లబ్‌పై దాడులు నిర్వహించి, పేకాట ఆడుతున్న 36 మందిని అరెస్టు చేశారు. దాడుల సందర్భంగా పేకాట రాయుళ్ల నుంచి పోలీసులు 237 కాయిన్‌లతోపాటు రూ. 6.21 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు. దీంతో అక్రమంగా సాగుతున్న పేకాట బాగోతం బట్టబయలైంది. ఇలా పలుమార్లు క్లబ్‌పై పోలీసుల దాడులు జరుగగా, కొంతకాలం తరువాత మళ్లీ తమ కార్యకలాపాలు కొనసాగించడం ఆనవాయితీగా వస్తోంది. కరోనా సమయంలో కొంతకాలంపాటు క్లబ్‌లో కార్యకలాపాలు నిలిచిపోగా, మళ్లీ ఊపందుకున్నాయి.రూ. మూడు కోట్లు పక్కదారి..మంచిర్యాల క్లబ్ నిర్వహణకు ప్రత్యేక కమిటీ ఉంటుంది. ఈకమిటీ ఆధ్వర్యంలోనే వివిధ కార్యకలాపాలు కొనసాగుతుంటాయి. గతంలో ఐబీ సమీపంలో ఉన్న క్లబ్‌ను 15 సంవత్సరాల క్రితం హైటెక్‌సిటీలోని నూతన భవనంలోకి మార్చారు. అప్పటి నుంచి సభ్యత్వం తీసుకునే వారి సంఖ్య క్రమేపీ పెరిగింది. క్లబ్ పేరిట బ్యాంకుల్లో డిపాజిట్లు కూడా పెరిగాయి. దాదాపు మూడు కోట్ల రూపాయల పై చిలుకు నిధులు క్లబ్‌పేరిట బ్యాంకుల్లో జమ అయ్యాయి. అయితే ఎప్పటికప్పుడు నూతన కమిటీని ఎన్నుకోవలసి ఉండగా, దశాబ్దకాలం పాటు అదే కమిటీని కొనసాగించారు. ఆసమయంలో కమిటీ సభ్యులది ఆడిందే ఆటగా తయారైంది. కాలక్రమేణా బ్యాంకుల్లో నిల్వ ఉన్న నగదు మొత్తం మాయమైంది. ప్రస్తుతం క్లబ్ పేరిట చిల్లగవ్వ కూడా లేదని సమాచారం. సా?ధారణంగా టూర్‌ల సమయంలో సభ్యులు 40 శాతం, క్లబ్ నుంచి 60 శాతం ఖర్చులు వెచ్చిస్తుంటారు. డబ్బు లు లేకపోవడంతో నాలుగైదు సంవత్సరాలుగా టూర్‌లు బంద్ చేసినట్లు తెలుస్తోంది. ఇదిలా ఉండగా, ఈ మధ్యకాలంలో హైద్రాబాద్‌లో ఉన్న పలు క్లబ్‌లతో మంచిర్యాల క్లబ్‌ను అనుసంధానం కూడా చేసినట్లు తెలిసింది. తద్వారా మంచిర్యాల క్లబ్ సభ్యులకు హైద్రాబాద్‌కు వెళ్లి కూడా పేకాట ఆడే వెసులుబాటును నిర్వాహకులు కల్పించారు. క్లబ్‌లో నిధుల గోల్‌మాల్ విషయమై జోరుగా చర్చ జరుగుతుండటం, మూడు రోజుల క్రితం స్థానిక ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు క్లబ్‌లో గోల్‌మాల్ అయిన నిధులను కక్కిస్తాని బాహాటంగా హెచ్చరించడంతో ఈ అంశం తీవ్ర చర్చనీయాంశం అవుతోంది.




## నిబద్ధతతో పని చేస్తా.. కాంగ్రెస్ మండల అధ్యక్ష పదవి ఇవ్వండి

**కాంగ్రెస్ మండల కార్యనిర్వాహక అధ్యక్షులు కోడూరి రమేష్**



**ఇబ్రహీంపట్నం, జులై 3 (నవభూమి ప్రతినిధి):** కాంగ్రెస్ పార్టీ కోసం నిబద్ధతతో పనిచేసే తనకు కాంగ్రెస్ మండల అధ్యక్ష పదవి ఇవ్వాలని ఆ పార్టీ మండల కార్యనిర్వాహక అధ్యక్షులు కోడూరి రమేష్ పార్టీ నాయకత్వాన్ని కోరారు. గురువారం ఇబ్రహీంపట్నం ఏ బ్లాక్ సమావేశంలో ఇబ్రహీంపట్నం కాంగ్రెస్ పార్టీ మండల నూతన అధ్యక్ష పదవికి ఆయన నామినేషన్ వేశారు. నామినేషన్ పత్రాలను ఏ బ్లాక్ అధ్యక్షులు పాండురంగారెడ్డి, ఇబ్రహీంపట్నం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గురునాథ్ రెడ్డి, పీసీసీ సభ్యులు, మాజీ జడ్పీటీసీ భూపతిగళ్ల మహిపాల్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కొంగర విష్ణువర్ధన్ రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మంకాల కరుణాకర్ లకు నామినేషన్ పత్రాలు దాఖలు చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ మండల కార్యనిర్వాహక అధ్యక్షులు కోడూరి రమేష్ మాట్లాడుతూ ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు మాల్ రెడ్డి రంగారెడ్డి తన మీద నమ్మకంతో ఇబ్రహీంపట్నం మండల కార్యనిర్వాహక అధ్యక్ష పదవి ఇస్తే నమ్మకంతో బాధ్యతతో చేశానని అన్నారు. ఇప్పుడు కూడా నమ్మకంతో తనకు మండల అధ్యక్ష పదవి ఇస్తే మండలంలో కార్యకర్తలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని చెప్పారు. అదే విధంగా ప్రభుత్వం నుండి వచ్చే సంక్షేమ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్తామని అన్నారు. మండల ప్రజలకు ఏ సమస్యలు ఉన్నా వారిని స్థానిక ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి, ఆయన సహకారంతో పరిష్కరించినట్లు చెప్పారు. భవిష్యత్తులోనూ పార్టీ కోసం పనిచేస్తామని, తనపై నమ్మకంతో తనకు మండల అధ్యక్ష బాధ్యతలు అప్పగించాలని కోరారు.

## పట్నం చెరువు కట్ట కింద రోడ్‌పైన చెట్లను తొలగించాలి

**మున్సిపల్ కమిషనర్‌కు బీజేపీ నేతల వినతి**





**ఇబ్రహీంపట్నం, జులై 3 (నవభూమి ప్రతినిధి):** శేరిగూడ నుండి ఇబ్రహీంపట్నం మున్సిపల్ కేంద్రానికి వెళ్ళే చెరువు కట్ట కింద సాగర్ రహదారికి ఇరువైపులా ఉన్న చెట్లను తొలగించాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బీజేపీ మున్సిపల్ అధ్యక్షులు ముత్యాల మహేందర్ ఆధ్వర్యంలో నాయకులు మున్సిపల్ కమిషనర్ కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీజేపీ మున్సిపల్ అధ్యక్షులు ముత్యాల మహేందర్, బీజేవైయం జిల్లా నాయకులు మైలారం విజయ్ కుమార్, జిల్లా కౌన్సిల్ సభ్యులు ఆడపు రాఘవేంద్ర లు మాట్లాడుతూ ఇబ్రహీంపట్నం చెరువు కట్ట గుండా సాగర్ రహదారికి ఇరువైపులా ఉన్న చెట్ల వల్ల వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. చెట్ల వల్ల రహదారి, వాహనాలు కనిపించక ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని అన్నారు. వెంటనే తగు చర్యలు చేపట్టి రోడ్డు పైకి పెరుగుతున్న చెట్లను తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేవైయం జిల్లా నాయకులు అనిల్, రూపక్ సాగర్, బీజేపీ మున్సిపల్ నాయకులు జోర్రిగల అశోక్, ఆకుల సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

## పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

**లక్షెట్టిపేట, నవభూమి:** పాఠశాల, కళాశాల పరిస రాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్‌రావు విద్యార్థులకు సూచించారు. లక్షెట్టిపేట పట్టణం లోని ప్రభుత్వ పాఠశాల, కళాశాలను డీపీవో బుధవారం పరిశీలిం చారు. ఈ సందర్భంగా డీపీవో మాట్లాడుతూ పాఠశాల దేవాల యంలాంటిదని దీన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే ఆరోగ్యంగా ఉంటామని సీజనల్ వ్యాధులు కూడా రావన్నారు. చిత్తు కాగితాలను ఎక్కడపడితే అక్క డ పడేయకూడదని ప్రతీ తరగతి గదిలో తప్పకుండా చెత్తబుట్టను ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఎప్పటికప్పుడు పాఠశాల, కళాశాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని విద్యార్థులకు సూచించారు. అనం తరం పాఠశాల మధ్యాహ్న భోజన వంటశాలను పరిశీలించి పరి శుభ్రతపై నిర్వహకులకు పలు సలహాలు సూచనలు అందజేశారు. డీపీవో వెంట ఎంపీడీవో సరోజ, ప్రిన్సిపల్ లక్ష్మణ్‌రావు, అధ్యాప కులు, ఉపాధ్యాయులు ఉన్నారు.

